www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 సెప్టెంబర్ 2025
5
చిత్తూరు



చితికిపోతున్న.. కూలి బతుకులు..

- నాలుగు నెలలుగా అందని ఉపాధి వేతనాలు
- వ్యవసాయ పనుల వైపు మొగ్గుచూపుతున్న కూలీలు

రెక్కాడితే డొక్కాడని జీవితాలు.. నేడు ప్రభుత్వాలను నమ్ముకుని చితికి పోతున్నాయి. పూట గడవడం కూడా కష్టతరంగా మారడంతో వ్యవసాయ పనులుకైనా వెళితే ఒక పూటైనా ముద్ద నోటికి వెళుతుందని ఆశ పడుతున్నారు. ఈ దిశగానే నేడు చాలా మంది ఉపాధి కూలీలు ఉపాధి పనులను వదిలి పక్కదారి పడుతున్నారు. అధికారులు పనులకు రావాలని మొరపెట్టుకుంటున్న కూలీలు మాత్రం పట్టించుకోవడం లేదు. చేసిన పనులకు బిల్లులు వస్తే అప్పుడు పనులకు వస్తామని తగేసి చెబుతున్నారు.



ప్రజాశక్తి- పూతలపట్టు: తమ రెక్క కష్టాలను నమ్ముకుని ఉపాధి పనులకు వెళుతున్న కూలీలకు నేడు పూట గడవడం కూడా కష్టతరంగా మారింది. గత నాలుగు నెలలుగా ఉపాధి వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు సైతం ఆకలితో పొట్టచేత పట్టుకోవాల్సి వస్తోంది. నేడు, రేపు అంటూనే నాలుగు నెలలు కావస్తున్న కూలి వేతనాలు మాత్రం అందడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వేరే మార్గం లేక యధావిధిగా ఉపాధి పనులకు హాజరవుతున్న.. మరి కొంతమంది తమ కష్టాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ కూలి పనులకు వెళుతున్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ మారు ఏకంగా నాలుగు నెలల పాటు బిల్లులు అందలేదని... అధికారులకు తమ సమస్యలను నిత్యం విన్నవించుకుంటున్న పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు.

రూ.60 లక్షల బకాయిలు..

పూతలపట్టు మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉండగా.. 252 గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో 72 ఉపాధి పనులు జరుగుతుండగా ఇందులో 696 మంది మాత్రమే పనులు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 200 మంది కూలీలు వ్యవసాయం, ఇతర పనుల వైపు వెళ్లిపోయారు. ప్రస్తుతం మండలంలో నాలుగు నెలలకు సంబంధించి సుమారు రూ.60లక్షల ఉపాధి బకాయిలు రావాల్సి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

పార పట్టకుండానే హాజరు..

పూతలపట్టు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో పార పట్టకుండానే హాజరు పట్టికలో పేర్లు నమోదు అవుతున్నట్టు పెద్దఎత్తున వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు యంత్రాలతో పనులు చేసి జేబులు నింపుకుంటున్నట్టు నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఎదురు తిరిగిన ఉపాధి సిబ్బందిపై వేటు తప్పదన్నట్టు పాలకులు వ్యవహరిస్తున్నారన్న పుకార్లు వినిపిస్తున్నాయి.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే దిశగా..

- వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు



ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. చిత్తూరు జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. ఇందులో పూతలపట్టు నియోజకవర్గం కూడా ఒకటి. నియోజకవర్గం ప్రధాన కేంద్రమైన పూతలపట్టుకు ఇన్చార్జి ఎపిఓ ఉండడం మరింత బాధాకరం. పక్క మండలం నుంచి కాకుండా యాదమరి మండలానికి సంబంధించిన ఏపీవోను ఇన్చార్జిగా వేయడంతో పూతలపట్టు ఉపాధి హామీ అధికారుల పనితీరుకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. పనుల సమయంలో ఉపాధి కూలీలకు ఇక్కడ సరైన వసతులు కూడా కల్పించడం లేదు. అధికారులు ఈ నియోజకవర్గంలో కాస్త దృష్టి సారించాలి.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 8వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 8వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుశాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 8వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు పాత డీపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

కుప్పంలో నేడు పిజిఆర్ఎస్

కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంట గంట వరకు కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాణిపాకం ఆలయ ద్వారాలు మూత



ప్రజాశక్తి- ఐరాల: చంద్రగ్రహణం కారణంగా శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి ప్రధాన దేవాలయం, అనుబంధ దేవాలయాలైన శ్రీ మణికంఠేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీ వరదరాజస్వామి వారి ఆలయాలను ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం ఉదయం 4 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. గ్రహణం అనంతరం ఆలయ శుద్ధి పుణ్యహవచనం, గ్రహణ శాంతి, అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించిన తరువాత ఉదయం 6 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించన్నుట్లు పేర్కొన్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, అర్చకులు దేవాలయంలోని ప్రధాన ద్వారానికి తాళం వేశారు.

ఘనంగా అప్సమా దినోత్సవ వేడుకలు




అప్సమా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఎస్‌కె రాజా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మెనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా సమావేశం ఆదివారం హోటల్ భాస్కర నిర్వహించారు. అసోషియేషన్ అధ్యక్షులు సిఆర్ మహేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశానికి ముఖ్యఅతిధిగా విశాంత్రి ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా 70మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉండాల్సిన బంధాన్ని వివరించారు. తాను పనిచేసిన కాలంలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఎలా ఉండేవారో తెలిపారు. తక్కువ జీతాలకు నాడు పనిచేసినా వృత్తిపరమైన సంతృప్తి పొందిన్నట్లు చెప్పారు. అసోషియేషన్ అధ్యక్షులు సిఆర్.మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రైవేట్ స్కూల్ కీలకమన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్‌కె రాజా, ముఖ్య గురువు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, కోశాధికారి లక్ష్మిప్రసాద్, జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా సీతమ్స్ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే ఆదివారం స్థానిక బాలత్రిపుర సుందరి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న బాలవీరారెడ్డి మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో సమాజానికి అవసరమైన ఇంజనీర్లను తయారు చేయాల్సిన అవసరముందన్నారు. ఇంజనీరింగ్‌లో చేరుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పూర్తి చేసి సమాజానికి ఉపయోగపడాలన్నారు. కార్యాక్రమంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్వారీ యాజమాన్యం దౌర్జన్యం

- గ్రామస్తులపై దాడి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- 25 మందిపై కేసు నమోదు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: తమ గ్రామ సమీపంలో క్వారీ నిర్వహించవద్దు అన్నందుకు గ్రామస్తులపై గ్రానైట్ క్వారీ యాజమన్యాం దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొమరగుంట పంచాయతీ బందరాళ్లపల్లిలో గ్రానైట్ క్వారీ అనుమతుల విషయంగా గత కొంత కాలంగా స్థానికులు, క్వారీ యాజమాన్యం మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన శిల్ప పేరు మీద క్వారీ నిర్వహణకు అనుమతులు వచ్చాయని, సదరు శిల్ప బంధువు యుంగధర్ నాయుడు వాహనాలతో క్వారీకి దారి వేసుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. దీంతో వారిపై క్వారీకి చెందిన కొందరకు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా మరికొంత మంది గ్రామస్తులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అలాగే 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 20కిపైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని, అందరూ వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. క్వారీకి అనుమతి ఇస్తున్న స్థలంలో రైతు తమ పంటలను ఆరబెట్టుకునే స్థలమని, ఆ బండ మీదుగానే మేకలు, గొర్రెలు, పశువులను మేతకు అడవిలోకి తీసుకెళ్తామని, బండను నాశనం చేస్తే పశువులను మేతకు తరలించడం సాధ్యం కాదని తెలిపారు. అంతేకాకుండా క్వారీ నిర్వహణ వలన తమ పంటపొలాలు నాశనం అవుతాయని, గ్రానైట్ వ్యర్థాల వలన పంటలతోపాటు భూమి కూడా పనికిరాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా క్వారీకి సంబంధించి పనులు ప్రారంభిస్తే చుట్టూ కంచె వేసి దారిని ఆపేస్తారని, ఊరికి ఉన్న దారి కూడా లేకుండా పోతుందని చెబుతున్నారు. తమ గ్రామ పరిధిలో క్వారీకి అనుమతి ఇవ్వొద్దంటూ పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని, దీంతో తామే పనులను అడ్డుకున్నామని అయితే క్వారీకి చెందిన యుంగధర్ నాయుడు తిరుపతి నుంచి పది మంది రౌడీలను పిలిపించి దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో బద్రి (20), ధనలక్ష్మి (40), ప్రమీల (30) జయంతి రెడ్డి (45), వరప్రసాద్ (21) మరి కొంతమంది గాయాలతో తిరుపతి సమీప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కానీ పోలీసులు తమ గ్రామానికి చెందిన 25మంది పైన అన్యాయంగా కేసులు పెట్టారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ఘర్షణకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఎమ్మెల్యే థామస్ దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించాలని మాజీ డిప్యూటి సిఎం కళత్తూరు నారాయణస్వామి మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అలాగే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు న్యాయం చేయాలని, గ్రామస్తులకు వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. గ్రామస్తులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎమ్మెల్యే థామస్ స్పందించి క్వారీ యాజమన్యాంపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోటుగారి భాస్కర్ కోరారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి. సుధాకర్‌రెడ్డి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న గ్రామస్తులను పరామర్శించారు. అక్రమ క్వారీల ఆగడాలను సాగన్వియమని, గ్రామస్తులపై క్వారీ యాజమాన్యం దౌర్జన్యం చేయడం అత్యంత కిరాతక చర్య అని, క్వారీ యాజమాన్యంపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



రుయా ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న బిఎన్.సుధాకర్‌రెడ్డి


గ్రానైట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్‌వాడ గంగరాజు

వెదురుకుప్పం మండలం కొమరకుంట పంచాయతీ బందార్లపల్లి గ్రామస్తులపై గ్రానైట్ క్వారీ యాజమాన్యం దౌర్జన్యం చేసి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గ్రానైట్ క్వారీ వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు విన్నపాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా అధికారులు గ్రానైట్‌కు పర్మిషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని, అందులో పని చేస్తున్న కార్మికులకు కూడా కార్మిక చట్టాలు వర్తింపచేయకుండా దోపిడీ చేస్తున్నారన్నారు. జిల్లా అధికారులు కూడా దోపిడీ చేస్తున్న క్వారీ గ్రానైట్ యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటే పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో యాజమాన్యం దాడిలో గాయపడిన ప్రజలకు మెరుగైన వైద్యం అందించి నష్టపరహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఎరువులు పంపిణీ : కలెక్టర్


ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): రైతులకు ఇబ్బంది లేకుండా సోమవారం నుంచి ఆర్ఎస్కేలలో ఎరువుల పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదివారం ఓ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. ఆర్ఎస్కేల వద్ద ఏర్పాట్లు, టోకెన్లు తదితరాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



గ్రామస్థాయిలో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి మమేకమవ్వాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఎరువుల పంపిణీ విషయంలో ఎటువంటి ఆందోళన వద్దన్నారు. జిల్లా నుండి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎరువుల కోసం సొసైటీలకు వచ్చే రైతులు ఎండా తీవ్రతకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా షామియానాలు వేయించాలని, కుర్చీలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రావణబ్రహ్మ వాహనంపై వినాయకుడు

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం 12వ రోజు రావణబ్రహ్మ వాహన సేవ రాత్రికి చంద్రగ్రహణం కారణంగా ఉదయం వైభవంగా నిర్వహించారు. వరసిద్ధి వినాయక స్వామివారు రావణబ్రహ్మపై అధిష్టించి కాణిపాకం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఏఎస్పి రాజశేఖర్ రాజు, ఆలయ అధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.




విద్యా ప్రమాణాల పెంపులో సమగ్రశిక్షా అభియాన్

ఇంటర్వ్యూ

వెంకటరమణ, పీడీ జిల్లా సమగ్రశిక్షా అభియాన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

విద్యాప్రమాణాల పెంపు కోసం సమగ్రశిక్షా అభియాన్ కృషి చేస్తున్నట్లు సమగ్రశిక్ష అభియాన్ పీడీ వెంకటరమణ తెలిపారు. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా జిల్లాలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 5వ తేదీ గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించి 70మంది ఉత్తమ ఉపాధ్యాయలను గౌరవించడం జరిగిందన్నారు. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నిర్వహిస్తూ కార్యక్రమాలను ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేశారు.



ప్రజాశక్తి: మోడల్ స్కూల్ ఏర్పాటులో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయా..?

పీడీ: మోడల్ స్కూల్ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల్లో అపోహలున్నాయి. ఊరికి దూరంగా విద్యార్థులు వెళ్ళాల్సి వస్తుందనే ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్తు కోసం మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని 31 మండలాల పరిధిలో 498 మోడల్ స్కూల్ ఏర్పాటు కానున్నాయి. కుప్పం నియోజకవర్గంలో 35 మోడల్ స్కూల్స్‌లో ప్రత్యేక సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న మోడల్ స్కూల్‌లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

ప్రజాశక్తి: స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ వల్ల ప్రయోజనం ఏమిటి..?

పీడీ: విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులను తెలియజేసేలా జిల్లాలోని పాఠశాల హెచ్ఎంలకు మూడు రోజులు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వడం జరిగింది. 265 మంది ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలకు, 191మందికి రెండో దఫా శిక్షణ ఇవ్వడం జరిగింది.

ప్రజాశక్తి: పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు అవుతున్నాయా..?

పీడీ: ప్రతి మండల విద్యా కేంద్రానికి రూ.70వేలు, ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.28,700, ఎక్కువ మంది పిల్లలున్న పాఠశాలకు లక్షల రూపాయలు మెగా పిటిఎం 2.0లో భాగంగా గ్రీన్ పాస్పోర్ట్ గ్రాంట్ ప్రభుత్వం విడుదల చేసింది. మన జిల్లాలో రూ.11.60,740 మంజూరు చేశారు. సిఆర్‌సి గ్రాంట్ రూ.42,47,600, కాంపోసిట్ గ్రాంట్ రూ.2,68,825, గ్రీన్ పాస్పోర్ట్ గ్రాంట్ రూ.11,60,740 మంజూరు చేశాం.

ప్రజాశక్తి : తల్లికి వందనం పథకం ఎంత మందికి అందించారు.....?

పీడీ: పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని 31 మండలాల్లో 2,23,201 మంది లబ్ది పొందుతున్నారు. ఈ పథకం ద్వారా రూ.334.80 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

ప్రజాశక్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పిటిఎం 2.0లో జిల్లాలో ఎంత మంది పాల్గొన్నారు..?

పీడీ: మెగా పిటిఎం 2.0 గిన్నిస్ రికార్డు సాధించడం తెలిసిందే. జిల్లాలోని 31 మండలాల నుండీ 4,98,683 మంది పాల్గొన్నారు. అలాగే విద్యార్థిమిత్ర ద్వారా జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరంలో 1,44,400 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశాం.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- దుర్వాసనతో తప్పని ఇబ్బంది
- అనారోగ్యంతో అవస్థలు పడుతున్న ప్రజలు
- రేషన్‌షాప్ వద్ద పేరుకుపోయిన మురుగు



ప్రజాశక్తి- విజయపురం (నగరి):

నగరి మున్సిపాలిటీ సత్రవాడ పరిధిలోని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సుమారు 10 సంవత్సరాలుగా మురుగునీటి కాలువలు పూడిపోవడంతో పక్కనే ఉన్న సచివాలయం, రేషన్‌షాప్ వద్ద మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. సచివాలయానికి వచ్చేవాళు, రేషన్ బియ్యం తీసుకునేవారు పడుతున్న అవస్థలు ఇంతాఅంత కాదు. ఆ మురుగునీటిలోనే నడిచివెళ్లి రేషన్ బియ్యం తీసుకోవాలి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు మారుతున్న సత్రవాడ 20వ వార్డు డ్రైనేజీ వ్యవస్థ మాత్రం మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో స్థానికులే కాకుండా ఆ దారి గుండా వెళ్లే వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పరిసరా ప్రాంతాల్లోని మురుగునీటి కాలువలు పూడిపోవడంతో మురుగునీరు రోడ్డంతా పారుతోంది.

విష జ్వరాల భారిన పడుతున్నాం..

మురుగునీరు నిల్వ చేరడం వలన దోమలు వృద్ధి చెంది దోమ కాటుకు గురై విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు ఎవరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించడం లేదని చెబుతున్నారు. మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల వలన రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు డ్రైనేజీలను శుభ్రం చేయించి మురుగునీరు పోవడానికి డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వెంటనే మురుగు తొలగించాలి : గ్రామస్తులు

మా ఇళ్ల మధ్యలో మురుగు నీరు చేరి నానా ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీ లేక ఎగువనుంచి వచ్చే మురుగునీరంతా సచివాలయం రేషన్ షాప్ వద్దనే చేరుతోంది. గతంలో ఇదే దారిలో వచ్చే మురుగు నీరు పోవడానికి ఉన్న డ్రైనేజీ ఇప్పుడెందుకు లేదో అధికారులు పరిశీలించాలి. ప్రత్యామ్నాయ డ్రైనేజీని నిర్మించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ అధికారులపై ఉంది. తక్షణమే స్పందించి డ్రైనేజీ నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలి.

'పుస్తకంతో నడక' విజయవంతం

- పుస్తకాలు ఉన్న ఇళ్లన్నీ విశ్వ విద్యాలయాలు
- పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: పుస్తకాలు వున్న ఇళ్లన్నీ విశ్వవిద్యాలయాలే అని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి అన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి పుస్తకానికి ఉందని మంచి వ్యక్తిత్వం, మంచి సమాజం పుస్తకం ద్వారానే ఏర్పడుతుందని పలమనేరులో రచయితల సంఘం, పలమనేరు గ్రంథాలయం, ఇతర సాంస్కృతిక సంఘాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'పుస్తకంతో నడక' కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం సంయుక్తంగా ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో పాఠకులు, రచయితలు విద్యార్థులు పుస్తకాలు చేత పట్టుకొని పుస్తకంతో నడక కార్యక్రమంలో పాల్గొన్నారు. పురవీధుల్లో పుస్తకంతో నడకను కొనసాగించారు. పుస్తక పఠనం ఆవశ్యకత, గ్రంధాలయాల అభివృద్ధి, ప్రతి ఇంట్లో గ్రంథాలయాలను ఏర్పాటు గురించి ఆటో ద్వారా పలమనేరు పట్టణ వీధుల్లో ప్రచారం నిర్వహించారు. మరో గ్రంథాలయ ఉద్యమం ద్వారా గ్రంథాలయాలకు పాఠకులను చేరువ చేయడం, విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని కలిగించడం, సంచార గ్రంథాలయాల ఏర్పాటు, ఇంటింటా గ్రంథాలయాలను నెలకొల్పటం, మంచి సమాజ నిర్మాణం కోసం మంచి పుస్తకాలు నిర్మాణాత్మక శక్తిని, సంకల్ప బలాన్ని అందిస్తాయన్నారు. అన్ని వయసుల వారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి, స్థానిక రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజి అన్నారు. భాషా సంస్కృతులతో పాటు వ్యక్తిత్వ వికాసానికి పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి హేమకుమార్, బహుజన విజ్ఞాన వేదిక నాయకులు మిఠాయి యుగంధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని ఒకరోజు ముందుగా ప్రజలందరికీ కూడా పుస్తక పఠనం పట్ల ఆసక్తిని కలుగజేసేందుకే పుస్తకంతో నడక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు పలమనేరు రచయితల సంఘం కార్యదర్శులు డి కుమార స్వామి రెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేందుకు నినాదాలతో ప్లకార్డులతో , పుస్తకాలతో పుస్తకంతో నడక కొనసాగించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను, సాహిత్య గ్రంథాలను రచయితలు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి తులసినాథం నాయుడు, రైతు సంఘం నాయకుడు ఉమాపతి, గ్రామ సేవా సమితి, శివాడి వి రామమూర్తి, వి ధనంజయ, రిటైర్డ్ హెడ్మాస్టర్ తాతయ్య, రచయితలు డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర , చంద్రశేఖరయ్య దోర్నాధుల సిధార్థ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సోమ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.



'పుస్తకంతో నడక' కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండలం కొండరాజు కాలువ పంచాయతీ మడవనేరి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణానికి ఇవి ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి గాలి దిలీప్ కుమార్, సర్పంచ్ దొడ్ల పరంధామనాయుడు, ఏఎంసి బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, అరగొండ సహకార సంఘం అధ్యక్షులు ఏ రంజిత్ రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు సతీష్, బూత్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సుధీర్ నాయుడు, ఉప సర్పంచ్ మధు నాయుడు, పార్టీ నాయకులు సుకుమార్ నాయుడు, రేషన్ షాప్ డీలర్ విఆర్ఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం అన్నదానం నిర్వహించారు. మండలంలోని జంబు వారి పల్లి పంచాయతీ మాధవ నగర్ వద్దగల బ్రహ్మానంద ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కేశవానందస్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులుగా బోడబండ్లకు చెందిన చంద్రయ్య నాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, సుధాకర్ రెడ్డి, విద్యాధర్ రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, నర్సింహులు నాయుడు భక్తులు పాల్గొన్నారు.



రేపు రైతుల సమస్యలపై పోరాటం : వైసిపి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మామిడి, యూరియాపై రైతులు ఎదురుకుంటున్న సమస్యపై ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్న పోటానికి రైతులందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని గంగాధర నెల్లూరు మండల వైసిపి అధ్యక్షుడు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిద్ర లేవలేదని, మామిడి రైతుల కొనుగోలు సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సబ్సిడీ డబ్బులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ వైసిపి అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీ చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్న 'రైతులకు అండగా వైసిపి' పోరాట కార్యక్రమంలో భాగంగా వినతి పత్రం సమర్పించే కార్యక్రమానికి జీడి నెల్లూరు మండల రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరను ఫ్యాక్టరీ యాజమాన్యం ఎందుకు మామిడి రైతులకు చెల్లించలేదని ప్రశ్నించారు. మామిడి కేజీకి ఫ్యాక్టరీ వారు 8 రూపాయలు, ప్రభుత్వం నాలుగు రూపాయలు చెల్లిస్తుందని చెప్పినా ఎక్కడా అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. వ్యవసాయ రైతులకు యూరియా కొరత సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతన చర్యలు చేపట్టి సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు ముని రాజారెడ్డి, రాష్ట్ర మాజీ గ్రీన్ అండ్ బ్యూటిషియన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఏకాంబరం, నేతలు నాయని రెడ్డి, యువజన విభాగ అధ్యక్షులు కిషోర్ రెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కేశవ రెడ్డి, రఘు రెడ్డి, చంద్రారెడ్డి, దినేష్, పలువురు వైసిపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుతంత్రాలు ఎల్లకాలం సాగవు: వైసిపి



ప్రజాశక్తి-పూతలపట్టు: 'కుతంత్రాలు ఎల్లకాలం సాగవు.. చట్టం ముందు అందరూ సమానులే..' అంటూ మద్యం అక్రమ కేసులో కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిన గోవిందప్ప ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలకు బెయిల్ రావడంపై వైసిపి రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మండిపడ్డారు. కక్షపూరిత రాజకీయాలకు దిగిన ఏ ప్రభుత్వం నిలబడిన విషయం చరిత్రలో లేదన్నారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కూడా త్వరలోనే కడిగిన ముత్యంలా బయటికి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 14 నెలల పాలనతోనే విసిగిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలోని భూదేవి, శ్రీదేవి సమేత నారాయణ స్వామిలకు కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి స్వామి అమ్మవార్ల విగ్రహాలకు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించి పట్టు వస్త్రాలు సమర్పించి అర్చకులు వేదమంత్రోచ్చారణ మధ్య వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవం, అన్నదానం ఉభయ దారులుగా తిరుపతికి చెందిన సందీప్ రెడ్డి, చిత్తూరుకు చెందిన సందీప్ రెడ్డి లు వ్యవహరించారు. అనంతరం వారిరువురి ఉభయదారులకు స్వామి చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, పలువురు అర్చకులు పాల్గొన్నారు.



గొప్ప వ్యక్తి గంగాధరం : పిఆర్‌టియు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజంలో అభ్యున్నతి కోసం ఎంతో కృషిచేసిన గొప్ప వ్యక్తి ఉపాధ్యాయుడు గంగాధరం అని పి ఆర్ టి యు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరి ప్రసాద్ రెడ్డి అన్నారు. గంగాధర నెల్లూరు మండలంలోని అక్కన్న గారి పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గంగాధరం ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గంగాధరంను ఉపాధ్యాయ యూనియన్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఎన్నో అవార్డులు పొందిన ఉపాధ్యాయుడు గంగాధరం, పిఆర్టియు యూనియన్ లో మండల గౌరవాధ్యక్షుడుగా కూడా సేవలందించారని మండల ఎంఈఓ లు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు యూనియన్ నాయకులు జనరల్ సెక్రెటరీ పురుషోత్తం, చెన్నకేశవలురెడ్డి, ఎస్‌టియు మండల నాయకులు కమలాపతి, కోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -పెద్దపంజాణి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామస్వామి కుటుంబానికి మండల వాల్మీకి సంఘం చే 30 వేల రూపాయలు ఆర్థిక సాయం ఆదివారం చేసినట్లు మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు మాడి శంకరప్ప తెలిపారు. వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు సీనియర్ లాయర్ ఎల్.భాస్కర్ ఈ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబానికి సానుభూతి తెలిపి మీ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల వాల్మీకి సంఘం నాయకులు ప్రథమ చికిత్స వైద్య అధికారి సుబ్రహ్మణ్యం,ఆ సంఘ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దపంజాణి: వరి ఇతర పంటలు సాగు చేసుకున్న రైతులకు నేటి నుంచి యూరియా పంపిణీ చేస్తున్నామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు.పెద్దపంజాణి,శంక్రయలపేట, రాజుపల్లి, బట్టందొడి, తుర్లపల్లి కొళత్తూరు,లింగాపురం రైతు సేవ కేంద్రం పరిధిలోని రైతులకు నేడు 8వ తేదీ సోమవారం, అదేవిధంగా మంగళవారం 9వ తేదీ నాగిరెడ్డిపల్లి, వీరపల్లి, పెద్దకాప్పల్లి, రైతు సేవ కేంద్రం పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులకు అందుబాటులో యూరియా: ఏవో

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో ప్రస్తుతం 2406 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. ఈ సమయంలో ముఖ్యంగా వరి పంటకు అత్యవసరంగా అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి (ఏవో) తెలిపారు. మొత్తం 124 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి అందగా, మండల కేంద్రంలోని సహకార సంఘంతో పాటు 7 రైతు సేవా కేంద్రాలు కలిపి పంపిణీ చేపట్టనున్నాయి. ఈ యూరియాను సోమవారం రైతులకు అందించనున్నారు. రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుబుక్, ఆధార్ జిరాక్స్ కాపీలతో హాజరై, డీబీటీ ఆధార్ నమోదు చేయించుకుని తగిన యూరియా బస్తాలను తీసుకోవాలని ఏవో సూచించారు.

గ్రామాల వారీగా యూరియా బస్తాల కేటాయింపు

గొల్లచీమలపల్లి, పెద్దచల్లారగుంట -500 బస్తాలు
కంభంపల్లి -100 బస్తాలు
తీర్థం, దేవదొడ్డి, గడ్డురు -350 బస్తాలు
పాతూరునాత్తం, కడపనత్తం - 450 బస్తాలు
నెల్లిపట్ల, చప్పిడిపల్లి -500 బస్తాలు
బేలుపల్లి - 200 బస్తాలు
బైరెడ్డిపల్లి -150 బస్తాలు అందుబాటులో వున్నాయని పేర్కొన్నారు. వారి వారి సమీపంలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి యూరియా బస్తాలు తీసుకోవాలని ఏవో సూచించారు.

చౌడేపల్లి: మండల వ్యాప్తంగా ఈనెల 8వ తేదీ నుంచి యూరియా పంపిణీ చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమా ర్ తెలిపారు. మండలం లోని 12 రైతు సేవా కేంద్రా లకు సంబంధిం చిన రైతులకు వ్యవసాయ శాఖ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో యూరియా ఇస్తా మన్నారు. చౌడేపల్లి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు 81 టన్నుల యూరియా వచ్చిందని రైతు సేవా కేంద్రాలకు యూరియా వచ్చిందో ఆ కేంద్రానికి సంబంధించిన రైతులకు మాత్రమే యూరియా ఇస్తారని ఆ పంచాయతీల పరిధిలోని చెందిన రైతులు మాత్రమే రావాలని సూచించారు. రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ జిరాక్స్‌లు తీసుకు రావాలని సూచించారు. వచ్చిన రైతులకు ఇప్పుడు వచ్చిన స్టాక్ సరిపోకపోతే మళ్లీ తెప్పించి ఇస్తామన్నారు.

సోమల: సోమల మండలంలోని సోమల, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, నంజంపేట, పొదలకుంట్లపల్లి, 81చిన్న ఉప్పరపల్లి, వల్లిగట్ల రైతుసేవా కేంద్రాలకు యూరియా స్టాక్ వచ్చిందని, నేడు సోమవారం తేదీన రైతుసేవాకేంద్రాలకు సంబంధించిన రైతులకు వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో యూరియా ఇస్తామన్నారు. ఏఏ రైతు సేవాకేంద్రాలకు యూరియా వచ్చిందో, ఆ పంచాయతీకి సంబంధించిన రైతులకు మాత్రమే యూరియా ఇస్తామన్నారు. ఆ పంచాయతీలకు చెందిన రైతులు మాత్రమే రైతు సేవ కేంద్రాలకు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పుడు వచ్చిన స్టాక్ ఎంతమంది రైతులకు ఇవ్వగలమో అంతమంది ఇవ్వడం, స్టాకు మించి రైతులు అధికంగా వస్తే స్టాక్ సరిపోకపోతే మళ్లీ తెప్పించుకుంటామని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించి యూరియా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.



రైతులకు అందించేందుకు యూరియ బస్తాను సిద్ధం చేస్తున్న దృశ్యం

30 యాక్టు దుర్వినియోగం

- జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు కె కోదండ రెడ్డి



ప్రజాశక్తి -శాంతిపురం: శాంతి భద్రతల పరిరక్షణకు ముందు జాగ్రత్తగా ప్రయోగించాల్సిన 30 పోలీస్ యాక్టును రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ విపక్షాన్ని అణిచివేసే కుట్రలో భాగంగా పోలీసుల ద్వారా ఈ చట్టాన్ని ఏడాది పొడవునా అమలు చేస్తూ వివక్ష చూపుతోందని చిత్తూరు జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు కె కోదండరెడ్డి పేర్కొన్నారు. కుప్పం నియోజక వర్గంలో కుప్పం పోలీస్ డివిజన్ అధికారి ప్రతినెలా ఈ యాక్టును పొడిగిస్తూ విపక్ష కార్యక్రమాలు జరగ కుండా చేస్తూ వైసిపి కార్యక్రమాలకు పోలీసులు అనుమతులు ఇవ్వకుండా నిబంధనలు, పరిమితులు విధిస్తున్నారని ఆరోపించారు. వైసిపి అధిష్టానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు నిరాకరిస్తూ మోకాలడ్డుతున్న కుప్పం నియోజకవర్గ పోలీసులు అధికార పార్టీకి మాత్రం చట్టాన్ని మినహా యిస్తున్నారని వాపో యారు. అధికార పార్టీ కార్యక్రమాలకు వేరే రాజ్యాంగం, చట్టాలను విపక్ష పార్టీ కార్యక్రమా లకు మరో రాజ్యాంగం, మరో చట్టాలను పోలీసు లు పాటిస్తున్నా రన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధ మన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్య నియోజక వర్గంలో విపక్ష కార్యక్రమాలకు భద్రత ఇవ్వలేనంత బలహీనంగా పోలీసు వ్యవస్థ ఉందో లేక విపక్షం బలపడుతుందని అధికార పక్షం ఆందోళన చెందుతూ పోలీసులను ఆదేశిస్తోందో అర్థం కావడం లేదన్నారు. త్వరలోనే దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తు న్నామని తెలిపారు. ప్రజా రక్షణకు ఉపయోగిం చాల్సిన చట్టాలను, విపక్షాన్ని నియంత్రించేందుకు వాడు తున్న వైనంపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

వరసిద్ధి వినాయకుని సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆదివారం దర్శించుకున్నారు. వీరు ఉదయం అయ్యప్ప స్వామి మాల దీక్ష తీసుకుని స్వామిని దర్శంచుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్ర మంలో దేవ స్థానం మాజీ ఛైర్మన్ మణి నాయుడు, ఆలయ అధికారులు, స్థానిక నాయ కులు, ప్రజాప్రతి నిధులు, తవణంపల్లి మండల అధ్య క్షుడు వెంకటేశ్వర చౌద రి, యాద మరి మండల అధ్యక్షుడు మొరార్జీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చిత్రపటాన్ని ఇస్తున్న ఈవో పెంచలకిషోర్

వైసిపిని బలోపేతం చేద్దాం: వజ్ర భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి -చౌడేపల్లి: వైసిపిని గ్రామీణ ప్రాంతాల్లో మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుందామని వైసిపి సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు వజ్ర భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మండల స్థాయిలో గడ్డం వారి పల్లి రోడ్డు లోని బైసాని కళ్యాణమండపంలో వైసిపి నాయకులు కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైసిపికి ప్రాతినిధ్యం వహించేలా నియమించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, యువకుల నుంచి రైతుల వరకు ప్రతి ఒక్కరిని కమిటీలో భాగస్వాములుగా చేసి వారి ద్వారా భవిష్యత్తులో వైసిపి ఎలాంటి ఎన్నికల్లో అయినా అత్యధిక మెజార్టీతో గెలిపించు కునేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి ఆదేశాలున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు గల్లం తయ్యేలా చూడాలని కనీసం డిపాజిట్లు కూడా రాకుండా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో పనిచేసిన వాలంటీర్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బాధకు గురైన అందరిని కమిటీల్లో చేర్చుకొని సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. సోషియల్ వింగ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాలు చేరవేసుకుంటూ పార్టీని మరింత పటిష్టం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, చౌడేపల్లి మండల ఇన్‌ఛార్జి చంగారెడ్డి మండల ఉపాధ్యక్షు లు నరసింహులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

క్రైం న్యూస్

పరమ సముద్రం శోకసంద్రం

- యువకుడి మృతదేహం లభ్యం..
- కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు

ప్రజాశక్తి-కుప్పం : కుప్పం మండలం పరమసముద్రం చెరువులో రెండు రోజుల క్రితం గల్లంతైన యువకుడు యువన్ శేఖర్ మృతదేహాన్ని ఆదివారం ఫైర్ సిబ్బంది వెలికి తీశారు. శుక్రవారం తన ఇద్దరు స్నేహితులతో కలిసి పరమ సముద్రం చెరువులో ఈత కొడుతూ యువర్ శేఖర్ గల్లంతయ్యాడు. అయితే రెండు రోజులు పాటు ఫైర్ సిబ్బంది యువకుడి మృతదేహం కోసం చెరువులో గాలించినా యువకుడి జాడ కనిపించ లేదు. హంద్రీ-నీవా నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పాటు పరమ సముద్రం చెరువు నిండి మొరవ పోతుండడంతో చెరువులో గాలింపు చేపట్టేందుకు ఫైర్ సిబ్బంది సైతం ఇబ్బంది పడ్డారు. అయితే ఆదివారం ఉదయం మరో మారు చెరువులో ఫైర్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చేపట్టగా యువన్ శేఖర్ మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. యువకుడి మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడంతో పరమసముద్రం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యువకుడి మృతదేహాన్ని వెలికి తీసిన దృశ్యం



కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఛైర్మన్ నాగరాజు సాకారంతో, మండలంలో ప్రతి నెల రెండవ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కుప్పం పిఇఎస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ విష్ణు బృందం శిబిరం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 27 మంది గ్రామస్తులు శిబిరానికి హాజరై తమ సమస్యలను డాక్టర్లకు వివరించారు. క్షుణ్ణంగా పరీక్షించిన అనంతరం, ఐదు గురికి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. వీరికి పిఇఎస్ హాస్పిటల్‌లో పూర్తిగా ఉచితంగా ఆపరేషన్ చేసి, ఇంటికి చేరుకునే వరకు కావలసిన అన్ని ఖర్చులు మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కంటి వెలుగును కోల్పోకుండా ఉండేందుకు పేదవారికి అండగా ఉంటామని తెలిపారు. గ్రామస్థులు, లబ్దిదారులు నాగరాజు సేవలను ప్రశంసించారు.

అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుపరిపాలనకు, ప్రజాసేవకు మారుపేరు చంద్రబాబు అని ప్రశంసించారు. అలాంటి గొప్ప వ్యక్తి నేతృత్వంలో పనిచేయడం తనకు ఆనందంగా ఉందన్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టాలనే దృఢ నిశ్చయంతో సంస్కరణలకు శ్రీకారం చుట్టి సంక్షోభంలోనూ అవకాశాలను వెతికి.., పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తాము నడుస్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై నిషేధం

- 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' దిశగా పలమనేరు
- మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్లాస్టిక్ అనే పెనుభూతం వెంటాడుతోంది. దీన్ని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కంకణ బద్ధులై వున్నాయని ఇందులో భాగంగానే పలమనేరును 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'గా తీర్చిదిద్దేందుకు అవగహన కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. ఎక్కడో ఒక్క చోట నిబంధనలు విస్మరిస్తూ ప్లాస్టిక్‌ను వాడేస్తున్నారు. దీన్ని కట్టడి చేసేందుకు పలమనేరులో అన్ని చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నిద్రలేచింది మొదలు పడుకునే వరకు ప్రతి వస్తువు ప్లాస్టిక్ తో చేసిన వాటినే అందరూ వినియోగిస్తున్నారని విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే అధికంగా వాడుతున్నారు. వేడి వేడిగా పెట్టిన ఆహారం ప్లాస్టిక్ బాక్స్‌ల్లో పెట్టిన కొన్ని గంటలకే రసాయనాలు ఆహారంలో కలిసి కేన్సర్ మహమ్మారికి దారితీస్తున్నాయన్నారు. ఇలాంటి ప్లాస్టిక్ బాక్సులను కొనుగోలు చేసి వ్యాధులు కొనితెచ్చుకోవడం అవివేకమన్నారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడంలో జిల్లాలోని విద్యా, వైద్యశాఖలు విఫలమవు తున్నాయన్నారు. ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేస్తే రోగాలను కొనుగోలు చేసినట్టేనని వైద్యులు హెచ్చరిస్తున్నా రన్నారు. మరిగించిన వాటర్ ను, అత్యంత శీతలమైన పదార్థాలను ప్లాస్టిక్ పాత్రలలో నింపితే సుమారు 90 శాతం కెమికల్స్ అందులో కరిగి ఆ పదార్థాలను విషపూరితం చేస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. వీటి వినియోగం ఆరోగ్యానికే కాక పర్యావరణానికి ప్రమాదకరమన్నారు. పాఠశాలలు, కళాశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సామాజిక వేత్తలు, ప్రభుత్వ అధి కారులు చొరవ చూపాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో అరికట్టాలని మునిసిపాల్టీ పరిధిలో ప్రత్యేక దుకాణం పెట్టి, రోజుకొక మెప్మా సిబ్బందిని నియమించి పట్టణంలో అమ్మకాలు సాగించే వారికి భూమిలో కరిగిపోయే సంచులను, బ్యాగ్స్ ను అందిస్తున్నామన్నారు. వీటినే వాడాలని , ప్రత్యేక ర్యాలీలు, అవగహన కార్యక్రమాలు , సదస్సులు, గ్రామ స్థాయిలో మెప్మా సిబ్బందిని పెట్టి మరీ అవగహన కల్పిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధంపై ఓ కంకణం కట్టి మరీ అడుగులు వేస్తున్న కమిషనర్ ను పట్టణ వాసులు ప్రశంసిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా విధిగా సహకరించాలని తెలిపారు. పలమనేరు మున్సిపల్ కమిషనర్ ప్లాస్టిక్ నిషేధం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి షాపుకు తన సిబ్బందితో వెళ్లి ప్లాస్టిక్ నిషేధం గురించి వివరిస్తూ ప్రత్యామ్నాయంగా గుడ్డ, జూట్ బ్యాగులను వాడాలని ప్రచారం చేస్తున్నారు.



ప్లాస్టిక్ వాడకం అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

